క్లుప్తంగా

మెడికల్ కిట్లు అందజేత



ముప్పాళ్ళ: ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.కాశయ్య చెప్పారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జయకృష్ణ ప్రవీణ్ ద్వారా ఉపాధి హామీ పథకం కూలీలకు అవసరమైన మెడికల్ కిట్లను మంగళవారం అందించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో తాగు నీటి సదుపాయంతో పాటు మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. మొత్తం 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అందించటం జరిగిందని ఆ పథకం ఏపీఓ జి.ఏడుకొండలు తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా కూలీలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని సూచించారు.

'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్ ఆవిష్కరణ



ముప్పాళ్ళ: డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోను డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి లాంటి నిషేధిత పదార్థాల అమ్మకాలు జరుపుతున్నా, వాడుతున్నా 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించవచ్చన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

భూ సార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి

ఏఓ అరుణ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రైతులు భూ సార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ అరుణ మాట్లాడుతూ రైతులందరూ గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మార్చి 31 వరకు మాత్రమే సాగునీరు విడుదలవుతుందని, రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పంటలను కాపాడుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కంది పంట కొనుగోలు

మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య

బెల్లంకొండ: రబీలో ఈ-క్రాప్ వివరాలు నమోదు చేయించుకున్న రైతుల నుంచి కంది పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని ఎమ్మాజీగూడెం, మన్నెసుల్తాన్ పాలెం గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కంది పంట ధర తగ్గుముఖం పట్టడంతో దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోకుండా ఉండాలని సూచించారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.7,550కు కందులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. జీడీసీఎంఎస్ అధికారులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి కందులను నాణ్యత ప్రమాణాల మేరకు శాంపిల్స్ తీసుకుంటారని తెలిపారు. అదే విధంగా రైతు విశిష్ట సంఖ్య నమోదు కొరకు రైతు సేవా కేంద్ర సిబ్బందిని వెంటనే సంప్రదించాలని కోరారు.

వైద్యులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పని చేసే వైద్యులు తమ వృత్తిని అంకితభావంతో నిర్వర్తించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జవ్వాజి రామమోహన్ రావు, మారెళ్ళ స్వామి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ పథకానికి నరసరావుపేటకు చెందిన నేరేళ్ళ విజయలక్ష్మి కుమారుడు నేరేళ్ల నాగార్జున్ సందీప్ జన్మదినం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో మంగళవారం 120 మంది రోగులు, వారి సహాయకులకు అన్న సంతర్పణ నిర్వహించారు. వైద్యులు డాక్టర్లు అప్పికట్ల ప్రవీణ్, సుజాత, అరుణ, అనూషలు సేవలు అందించారు. స్థానిక నాయకులు కూరపాటి విజయశంకర్, దివ్వెల శ్రీనివాసరావు, పోతుగంటి నరసింహారావు, గంజి వీరాస్వామి, సూరే రామకోటేశ్వరరావు, కొల్లిపాకుల సురేష్, అప్పాపురపు సూర్యకుమారి, నాళం భాస్కర్ పాల్గొన్నారు.

భవనం పూర్తయ్యేనా.. సేవలు అందేనా..?!

- నిలిచిపోయిన దొడ్లేరు పీహెచ్‌సీ నిర్మాణ పనులు
- రూ.2.50 కోట్లు నిధులు మంజూరు
- కాంట్రాక్టర్ వ్యక్తిగత కారణాలతో పనులు చేయటం లేదంటున్న అధికారులు



నిలిచిపోయిన దొడ్లేరు పీహెచ్‌సీ భవన నిర్మాణం

దొడ్లేరు(క్రోసూరు): జనాభా ప్రాతిపదికన మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి అందులో వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించి పేద ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు. అందులో భాగంగా క్రోసూరు మండలంలో ఒక పీహెచ్‌సీ ఉండగా 2023లో రెండవ పీహెచ్‌సీకి అనుమతి వచ్చింది. పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేశారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కానీ కాంట్రాక్టర్ వ్యక్తిగత కారణాలతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని అధికారులు తెలుపుతున్నారు. సుమారు 50 వేల జనాభా కలిగిన క్రోసూరు మండలానికి 18 పంచాయతీలుండగా వాటికి తోడు మూడు అనుబంధ గ్రామాలున్నాయి. అంటే మొత్తం 21 గ్రామాలున్నాయి. 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేయటంతో మండలంలో మొత్తం 15 సచివాలయాలు ఏర్పాటు చేశారు. అలాగే జనాభా ప్రాతి పదికన ఒక పీహెచ్‌సీతో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదని రెండవ పీహెచ్‌సీకి శ్రీకారం చుట్టారు.

రెండవ పీహెచ్‌సీ ఆవశ్యకత

క్రోసూరు మండలంలో 21 గ్రామాలకు ఒక పీహెచ్‌సీ ఉండటంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. అనుబంధ గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. ఈ సబ్ సెంటర్లలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో సేవలు అందిస్తున్నారు. వారు గ్రామాల్లో నిర్వహించే అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ గర్భిణులు, బాలింతలు, అత్యవసర సర్వీసులకు వైద్యుల సేవలు తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. దీంతో రెండవ పీహెచ్‌సీ ఆవశ్యకతను గుర్తెరిగిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దొడ్లేరులో పీహెచ్‌సీకి అనుమతులు మంజూరు చేసి రూ.2.50 కోట్ల నిధులు కేటాయించింది. అంతేకాక దొడ్లేరులో పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను కూడా నియమించింది. అదే పీహెచ్‌సీకి సొంత భవనం ఉండటం వలన స్టాఫ్ నర్సులు, సిబ్బందితో పీహెచ్‌సీలో ఆపరేషన్లు తదితర సాధారణ వైద్య సేవలు పేదలకు అందుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు పట్టించుకుని వెంటనే పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

దొడ్లేరు పీహెచ్‌సీ పరిధిలో 7 గ్రామాలు

మండలంలోని దొడ్లేరు గ్రామం చుట్టుపక్కల ఉన్న ఏడు గ్రామాలు దొడ్లేరు పీహెచ్‌సీ పరిధిలోకి తీసుకురావటం జరిగింది. అవి దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు, హసనాబాద్, నాగవరం, గుడిపాడు, అనంతవరం గ్రామాలు. దొడ్లేరులో పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే ప్రజలకు వైద్య సేవల దూరాభారం తగ్గుతుంది. ఉచిత వైద్య సేవల వలన ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు పెట్టుకోవాల్సిన అవసరం ఉండదని ప్రజలు వాపోతున్నారు.

త్వరలో పనులు చేపడతాం

కాంట్రాక్టర్ వ్యక్తిగత కారణాలతో పనులు నిలిచిపోయాయి. త్వరలో భవన నిర్మాణ పనులు చేపడతాం.

– పున్నారావు, ఆర్ అండ్ బీ ఏఈ, క్రోసూరు

భారం తగ్గుతుంది



పేద ప్రజల ఆరోగ్యం పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న శ్రద్ధ వలన మండలానికి అదనపు పీహెచ్‌సీకి అనుమతులొచ్చాయి. పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే ప్రజలకు వైద్య సేవల దూరాభారం తగ్గుతుంది. పైగా ఉచిత వైద్య సేవల వలన ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు పెట్టుకోవాల్సిన భారం తగ్గుతుంది.

– సయ్యద్ అబ్దుల్ రహీం, దొడ్లేరు

మహిళలకు ఎంతో మేలు



పీహెచ్‌సీ అందుబాటులో ఉంటే మహిళలకు ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, ఇతర ఆరోగ్య సమస్యలకు ఇక్కడే వైద్య సేవలు అందుతాయి. అత్యవసర సమయాల్లో ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడబడతారు.

– పోసిపోగు మరియమ్మ, దొడ్లేరు

పీఎం ఆవాస్ యోజన గృహాల పరిశీలన

నకరికల్లు: మండలంలో గతంలో నిర్మించి, నిర్మాణ దశలో ఉన్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాలను పరిశీలించి జాబితా సిద్ధం చేస్తున్నట్లు మండల హౌసింగ్ ఏఈ రాములు నాయక్ మంగళవారం తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలోని లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీజీటీలకు రూ.1లక్ష అదనంగా మంజూరవుతుందన్నారు. అర్హుల జాబితాను ఎంపిక చేసి నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతు యూనిక్ ఐడీ నంబర్‌ను పొందాలి

రాజుపాలెం: మండలంలోని ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను(యూనిక్ ఐడీ) కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రత్యేకమైన 11 అంకెలు గల సంఖ్యను రూపొందించబడుతుందని తెలిపారు. వీటి కోసం ఆధార్ కార్డు, పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డుకు లింకైన ఫోన్ నెంబర్‌తో ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. యూనిక్ నంబర్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం, పెట్టుబడి సహాయం, రాయితీపై వ్యవసాయ పనిముట్లు, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ తదితర సేవలను పొందవచ్చని తెలిపారు.

ఐక్యత, సేవా భావానికి ప్రతీక ఇఫ్తార్

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి



ముస్లిం సోదరులతో కలిసి నమాజ్‌లో డాక్టర్ గజ్జలసుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: ఆధ్యాత్మికతకే కాకుండా ఐక్యత, సేవా భావానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో నమాజ్ కార్యక్రమంలో మంగళవారం రాత్రి పాల్గొని రఫీ జ్ఞాపకార్థం ఆయన తండ్రి పీర్‌బుడా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ మూడు పూటలా తిండికి, ఒంటి నిండా బట్టకు నోచుకోని పేద వారు ఎంతో మంది ఉంటారని, అలాంటి అభాగ్యులు, పేదవారికి దానం చేయాలని ఇస్లాం ప్రబోధిస్తుందన్నారు. దీన్నే ఫిత్రా అంటారని, దీక్షను విరమించే సమయంలో చేపట్టే ఇఫ్తార్‌లు సోదర భావం, సౌభ్రాతృత్వానికి పెద్దపీట వేస్తాయన్నారు. అల్లా ప్రవక్త ప్రవచనల ప్రకారం రంజాన్ మాసంలో ఎవరైనా ఒక ఉపవాసికి అల్లాహ్ సమ్మతం లేదా పుణ్యం పొందడానికి ఇఫ్తార్ చేయిస్తే అతను తన పాపాల నుంచి క్షమించబడి మోక్షం పొందుతాడన్నారు. ఉపవాసికి ఎంతైతే పుణ్యం దక్కుతుందో అంతే పుణ్యం ఇఫ్తార్ చేయించిన వారికి దక్కుతుందన్నారు. రంజాన్‌లో ఇఫ్తార్‌కు ప్రాధాన్యత ఉంటుందన్నారు. శక్తి కొద్దీ సేవలు అందించేందుకు యువత, దాతలు ముందుకు వస్తారన్నారు. మసీదులు, ఇళ్లల్లో రంజాన్ మాసం అంతా ఆధ్యాత్మికతతో కూడిన వాతావరణం ఉంటుందన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఫీ జ్ఞాపకార్థం తండ్రి పీరుబుడా ఇఫ్తార్ ఏర్పాటు చేయడం పట్ల ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్, యూత్ నాయకులు అజ్‌గర్‌వలి, షరీఫ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేకు స్పందన కరువు



అంబడిపూడిలో పీ-4 సర్వే చేస్తున్న సచివాలయ కార్యదర్శి

అచ్చంపేట: ప్రభుత్వం గ్రామ సచివాలయ కార్యదర్శులచే గ్రామాలలో చేపట్టిన పీ-4 సర్వేకు స్పందన కరువైంది. గడువు మంగళవారంతో ముగియగా చాలా గ్రామాల్లో సర్వే ఇంకా పూర్తి కాలేదు. సచివాలయ కార్యదర్శులు గ్రామాలలో ఇంటింటికి తిరిగి యక్ష ప్రశ్నలు అడుగుతుంటే ప్రజలు విసుక్కుంటున్నారని కార్యదర్శులు చెబుతున్నారు. ఇవాళ బైకు, టీవీ, కంప్యూటర్, ఇంటర్నెట్, సెల్ ఫోన్, గ్యాస్ స్టౌ లేని ఇళ్లు ఏవైనా ఉంటాయా, ఇన్ని ప్రశ్నలు మీకెందుకు సమాధానం చెప్పాలి.. మేము చెప్పమంటూ గ్రామస్తులు మొరాయిస్తున్నారని కార్యదర్శులు వాపోతున్నారు. 27 ప్రశ్నలతో కూడిన సర్వే పూర్తి అయిన తరువాత సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుందని చెప్పమంటే కూడా చెప్పడం లేదంటున్నారు. ఒక పక్క సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పొద్దంటూ ఎవరికి ఫోన్ చేసినా వాయిస్ టోన్‌లు వచ్చే ఈ సమయంలో ఓటీపీలు మీకెందుకు చెప్పాలంటూ గ్రామస్తుల నుంచి ప్రతిఘటన ఎదురవుతోందని అంటున్నారు. దీంతో సచివాలయ కార్యదర్శులకు పీ-4 సర్వే ఒక పెద్ద సవాల్‌గా మారింది. చేయాల్సిన విధులు మాని ఇలాంటి సర్వేలు చేయాల్సి వచ్చిందేంట్రా అని సచివాలయ సిబ్బంది తలలు బాదుకుంటున్నారు.

జాబ్ మేళాలో 16 మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలతో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మంగళవారం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 16 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంస్థ కో ఆర్డినేటర్ అంజిరెడ్డి తెలిపారు. ఈ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాబ్ డ్రైవ్‌కు 3 కంపెనీలు రాగా 26 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. వారిలో 16 మంది ఉద్యోగాలకు ఏంపిక అయినట్లు తెలిపారు. వారందరికీ నియామక పత్రాలు అందజేశామన్నారు. ఎంపికైన వారందరికీ అభినందనలు తెలిపారు. ఎంపికైన వారు మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకునేందుకు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రవీంద్ర నాయక్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బి.అంజి రెడ్డి, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంహెచ్‌జీఎస్ డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

22న ప్రధాన తపాల కార్యాలయ భవనానికి భూమి పూజ



సత్తెనపల్లి: సత్తెనపల్లిలో రూ.2.60 కోట్లతో ప్రధాన తపాల కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రధాన తపాలా కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఈ నెల 22న భూమి పూజ జరగనుందని నరసరావుపేట డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రఘురామ్‌నగర్‌లో ఉన్న పోస్టల్ శాఖకు చెందిన 48 సెంట్ల స్థలంలో రూ.2.60 కోట్లతో తపాలా కార్యాలయ నూతన భవనం నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 22న కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తిలు పాల్గొంటారన్నారు.

అధికారులను కలిసిన సచివాలయ ఫెడరేషన్ కార్యవర్గం



సత్తెనపల్లి: గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్-2025 నూతన కార్యవర్గం మంగళవారం వివిధ శాఖల అధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద కుమార్, టౌన్ సీఐ కె.బ్రహ్మయ్యలను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువలతో సత్కరించారు. తమ యూనియన్‌ను పరిగణలోకి తీసుకొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయ పట్టణ అధ్యక్షుడు చిలుక ప్రదీప్, జనరల్ సెక్రటరీ ముప్పల గౌతమి, ఉపాధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, అబ్దుల్ మునాఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పుణ్యవతి, గౌరవ సలహాదారుడు రవి రాజ్, మహిళా పోలీస్ భవాని, గ్రామ రెవెన్యూ అధికారిణి అరుణ, అడ్మిన్ రవిచంద్ర తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ సత్తెనపల్లిలో అందరినీ భాగస్వాములను చేయండి

మున్సిపల్ కమిషనర్ ఆనందకుమార్



శానిటరీ సెక్రటరీలతో సమీక్షలో కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: స్వచ్ఛ సత్తెనపల్లిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం శానిటరీ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరే అవకాశం ఉండదన్నారు. దీనిలో భాగంగా పట్టణంలో పాలిథిన్‌ను సంపూర్ణంగా నిషేధించాలన్నారు. పట్టణ అభివృద్ధికి తోడ్పడేలా, స్వచ్ఛ సత్తెనపల్లికి చేయూతనిచ్చేలా ప్రజలు, వ్యాపారులతో శానిటరీ సెక్రటరీలు మమేకం కావాలన్నారు. శానిటరీ సెక్రటరీలు తమ బాధ్యతలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రధానంగా తడి, పొడి చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. వ్యాపారులు, గృహాల నుంచి చెత్తను కాలువల్లో, రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్‌లో వేసేలా తెలియజేయాలన్నారు. పట్టణంలో స్వచ్ఛతపై ఫీడ్ బ్యాక్ నిర్వహించడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పర్యటించేందుకు రానున్నారన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో శానిటరీ సెక్రటరీల పాత్ర కీలకమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి పాదయాత్రను జయప్రదం చేయండి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పెదకూరపాడు: విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన అగ్రిగోల్డ్ కన్నీటి పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు కోరారు. పెదకూరపాడులోని సీపీఐ కార్యాలయంలో ఆయన కార్యకర్తలు, అగ్రిగోల్డ్ బాధితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పదేళ్లగా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. అధికారంలోకి వచ్చి 9 మాసాలు గడిచిన కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. బాధితులకు రావాల్సిన మొత్తం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భైరవపట్నం రామకృష్ణ, కూచిపూడి చెన్నకేశవ, మంత్రాలు, పానయ్య పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

సత్తెనపల్లి: సత్తెనపల్లి బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరంకు జరగాల్సిన ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. తొలి రోజు సోమవారం 8 పదవులకు .. 9 నామినేషన్లు, రెండో రోజు మంగళవారం ఐదు పదవులకు.. ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి చిలుకా చంద్రశేఖర్, గంగూరి అజయ్ కుమార్, ఉపాధ్యక్ష పదవికి చిన్నం మణిబాబు, సర్వేపల్లి సీతారామాంజనేయులు(సీతయ్య), సెక్రటరీ పదవికి బయ్యవరపు నరసింహారావు, పి.హరిమణికంఠ, సబ్ కోర్టు సెక్రటరీ పదవికి షేక్ జానీ ఖాజావలి, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ- గుజ్జర్లపూడి సురేష్‌బాబు, ట్రెజరర్- బుర్రి సైదయ్య, జూనియర్ ఎగ్జిక్యూటివ్- తవ్వ హరనాథ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్- నిమ్మకాయల నాగులు, లైబ్రేరియన్- ఉల్లం మధుబాబు, మహిళా ప్రతినిధి- మహంకాళి కోటేశ్వరమ్మ నామినేషన్లు దాఖలు చేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్కురావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్.ఆంజనేయులు తెలిపారు. కాగా ఈ ఎన్నికల్లో కేవలం అధ్యక్ష, ఉపాధ్యక్ష, సెక్రటరీ, సబ్‌కోర్టు సెక్రటరీ పదవులకు మాత్రమే ఒక్కో పదవికి ఇరువురు చొప్పున పోటీ నెలకొంది. మిగిలిన పదవులకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్‌లు దాఖలు కావడంతో అవి ఏకగ్రీవం కానున్నాయి. అయితే అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నామినేషన్ల స్క్రూట్నీ బుధవారం జరగనుంది. 20న నామినేషన్‌ల ఉపసంహరణ, 21న పోటీ చేసే అభ్యర్థుల జాబితా వెల్లడి కానుంది. 27న ఎన్నికలు జరగనున్నాయి.

వ్యక్తిగత రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో వెనుకబడిన తరగతుల వారు, ఆర్థికంగా వెనుకబడిన వారు బ్యాంకుల ద్వారా ఇచ్చే వ్యక్తిగత రుణాలకు ఈ నెల 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. రుణాలకు అర్హత కలిగి, ఆర్థికంగా వెనుకబడిన కమ్మ, రెడ్డి, కాపు, బలిజ, వైశ్య, తెలగ తదితర కులాల వారు, 21 ఏళ్ల నిండి 50 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మండుతున్న ఎండ.. ఎండుతున్న మొక్కజొన్న



పెదకూరపాడు ఎస్ మైనర్‌లో నీరు లేక ఎండిపోయిన దృశ్యం

పుడమి తల్లిని నమ్ముకొని సాగు చేస్తున్న అన్నదాతను అడుగడునా కష్టాలు వెంటాడుతునే ఉన్నాయి. చీడపీడలు, సాగునీటి కొరత, దిగుబడి లేమి, గిట్టుబాటు ధర లేక పంట ఏదైనా నష్టాలు మాత్రం రైతులు చవిచూస్తున్నారు. మిర్చి పంటను నమ్ముకొని ధర లేక, దిగుబడి లేక తీవ్రంగానష్టపోయిన రైతులు రబీలోనైనా తమ అదృష్టం పరీక్షించుకునేందుకు మొక్కజొన్న సాగు చేస్తే సాగు నీరు లేక పంట ఎండిపోతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. పెదకూరపాడు మండలంలో రబీకి రైతులు 260 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు. కంకిమీద ఉన్నప్పుడు సాగునీరు లేక పంట ఎండిపోతుంది. నీరు లేకపోవడంతో కంకి పూర్తి కాకుండా సగానికే పరిమితమైంది. నాగార్జునసాగర్ నుంచి ఇటీవల సాగునీరు విడుదల చేసినా చివరి భూములకు అందడం లేదు. కేవలం 150 నుంచి 200 క్యూసెకులు నీరు మాత్రమే విడుదల చేయడంతో అమరావతి మేజర్‌కు మాత్రమే పరిమితి కావడంతో మైనర్లకు అందక పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు భానుడు భగభగలతో పంట పూర్తిగా ఎండిపోతుంది. కొంత మేరకైనా సాగునీరు అందిస్తే పంటలను కాపాడుకుంటామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– పెదకూరపాడు



సాగునీరు లేక సంగం కంకితోనే మొక్కజొన్న